ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 అక్టోబరు 2024

ఎట్లబ్బా చేసేది..!

యాడికి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. వైసీపీ వారి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి.. టీడీపీ వర్గీయుడికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు. తమ ప్రభుత్వం వచ్చినందున వైసీపీ వర్గీయుడిని తొలగించాల్సిందేనని పట్టుబడుతున్నారు. యాడికి సర్పంచు, ఎంపీపీ కుర్చీలు వైసీపీ చేతిలోనే ఉన్నందున.. తమవాడే కొనసాగాలని వైసీపీ నాయకులు అంటున్నారు. ఎవరి మాట వినాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సమస్య చిన్నదే అయినా.. పరిణామాలు ఎలా ఉంటాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు నోటీసులు ఇచ్చామని, అతను రాజీనామా చేసిన తరువాత కొత్తవారిని తీసుకుంటామని ఏపీఓ రమేష్ అన్నారు.



ముంపు పాపం వైసీపీదే..!

ఐదేళ్లు పూడిక తీయించని ప్రభుత్వం

పండమేరులో భారీగా ముళ్ల పొదలు

వంక పొడవునా ఆక్రమణలు.. గుడిసెలు

చిన్నపాటి వర్షానికే కాలనీలలోకి నీరు

అనంతపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగర శివారులో వరద బీభత్సానికి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న విమర్శలు వస్తున్నాయి. వంకలు, వాగుల నిర్వాహణను ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఉప్పరపల్లిలోని కాలనీల ముంపునకు ఇదే కారణమని బాధితులు అంటున్నారు. ఐదేళ్లలో పండమేరు వంకలో ఒక్కసారి కూడా జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు. వంకలో ఎటు చూసినా ముళ్ల పొదలే కనిపిస్తున్నాయి. వంక పొడవునా మట్టి పేరుకుపోయింది. పూడిక చేరడంతో మోస్తరు వర్షం కురిసినా కాలనీలోకి నీరు చేరుతోంది.

టీడీపీ హయాంలో..

టీడీపీ ప్రభుత్వం 2015-16లో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించింది. రాప్తాడు సమీపంలోని హైవే నుంచి ఉప్పరపల్లి వరకు ముళ్ల పొదలను తొలగించారు. ఆ తరువాత పనులు చేసిందే లేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు ఆ వైపు తొంగిచూసిన పాపాన పోలేదు. వంక ప్రాంతంలో మట్టి తవ్వకాలతో నీరు సాఫీగా ముందుకు వెళ్లడంలేదు. ఫలితంగా జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గురుదాస్ కాలనీ ముంపునకు గురవుతున్నాయి. రెండేళ్ల క్రితం వర్షాలకు జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ నీట మునిగాయి. తాజాగా అదే పరిస్థితి ఏర్పడింది.


పండమేరు వంకలో ఏపుగా పెరిగిపోయిన కంపచెట్లు

భారీగా ఆక్రమణలు

కాలనీల ముంపునకు ఆక్రమణలు మరో కారణం. వంక పొడవుగా ఆక్రమణలు కనిపిస్తున్నాయి. కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలవారు పేదల ముసుగులో ఇష్టారాజ్యంగా వంకను ఆక్రమించారు. గుడిసెలు వేయించడంతో వంక కుచించుకుపోయింది. పండమేరులో ప్రవాహానికి ఇవన్నీ అడ్డంకిగా మారాయి. ఇప్పటికైనా వంకలో ఆక్రమణలు తొలగించాలని, పూడిక, ముళ్ల పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పూడిక తీయాలి..



పడమేరు వంకలో పూడిక తీస్తే కాలనీలోకి నీరు రాకుండా ఉంటుంది. ఎప్పుడు వర్షం కురిసినా కాలనీ మునుగుతోంది. కాలనీలో ఉంటున్నవాళ్లం సొంతంగా వంకను శుభ్రం చేసుకుంటున్నాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. వంక పొడవునా మట్టి తీత పనులు చేపట్టాలి.

- బొమ్మన్న, జగనన్న కాలనీ

పట్టించుకోని వైసీపీ



పడమేరు వంకలో పూడిక తొలగిస్తే కాలనీల్లోకి వరద నీరు చేరదు. టీడీపీ హయాంలో వంకలో జంగిల్ క్లియరెన్స్ పనులు జరిగాయి. అప్పటి ప్రజాప్రతినిధులు పరిటాల సునీత, ప్రభాకర్ చౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేయించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారికూడా పనులు చేయించలేదు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. గ్రామ సమీపంలోని వంక పొడవునా ఆక్రమణలు జరిగాయి. వైసీపీ నాయకులు అడ్డదిడ్డంగా ఆక్రమించి సొమ్ము చేసుకున్నారు. వాటిని తొలగించినా ప్రయోజనం ఉంటుంది.

- శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకుడు, ఉప్పరపల్లి

వరద నష్టం రూ.3.25 కోట్లు: కలెక్టర్



అనంతపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరదలకు జిల్లా వ్యాప్తంగా రూ.3.25 కోట్ల నష్టం జరిగిందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 17 మండలాల పరిధిలోని 42 గ్రామాలలో వరద ప్రభావం కనిపించిందని అన్నారు. వ్యవసాయశాఖ పరిధిలో 481 మంది రైతులకు సంబంధించి 456.92 హెక్టార్లలో రూ2.66 కోట్ల పంట నష్టం జరిగిందని, 68.20 హెక్టార్లలో ఉద్యాన పంటలకు రూ73.19 లక్షల నష్టం జరిగిందని తెలిపారు. 40 ఇళ్లకు సంబంధించి రూ.4 లక్షలు, పశు నష్టం రూ.30 వేలు, గొర్రెలు, మేకల నష్టం రూ.10 లక్షలు జరిగినట్లు అంచనా వేశామని తెలిపారు. రూరల్ మండలంలో వరద గురించి తెల్లవారు జామున 3 గంటల సమయంలో స్థానికుల నుంచి సమాచారం రాగానే రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేశామని, 110 కుటుంబాలను కాపాడామని తెలిపారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 1995 మందికి వసతి, భోజనం కల్పించామని తెలిపారు. 361 మందికి పైగా బాధితులకు నిత్యావసరాలు, బియ్యం అందజేశామని తెలిపారు. వాతావరణ శాఖతో ఎప్పటికపుడు మాట్లాడుతూ ప్రాణ నష్టం జరగకుండా చూశామని అన్నారు. ఈ నెల 26న ఇళ్ల ముంపు బాధితులకు పరిహారం ఇస్తామని తెలిపారు. పంట నష్టం అంచనాలను ప్రభుత్వానికి పంపించామని, పరిహారం వచ్చిన వెంటనే ఇస్తామని తెలిపారు.

ఆక్రమణలపై సర్వే

జిల్లాలో వాగులు, వంక స్థలాల ఆక్రమణలపై త్వరలో సర్వే నిర్వహించి.. తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. నడిమివంక, మరువ వంక పైభాగాన ఉపాధి పథకం కింద నీటి సంరక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ వసంతబాబు, డీపీఎం ఆనంద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ యోగీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్త డీఈఓగా ప్రసాద్‌బాబు

వరలక్ష్మి చిత్తూరుకు బదిలీ



అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ జిల్లా అధికారిగా ప్రసాద్ బాబు నియమితులయ్యారు. డీఈఓ వరలక్ష్మిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వరలక్ష్మి జిల్లాకు ఫిబ్రవరిలో వచ్చారు. ఎనిమిది నెలల్లోనే ఆమె బదిలీ అయ్యారు. కడప జిల్లాకు వెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. నెలన్నరగా ఆమెను బదిలీ చేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో ఆమెను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.ప్రసాద్‌బాబును డీఈఓగా నియమించారు. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

ప్రజల విషయంలో పార్టీలు చూడం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం విషయంలో పార్టీలు, రాజకీయాలు చూడమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. పార్టీ అర్బన్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు రూ.11.70 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఆయన అందజేశారు. ప్రజలకు మంచి చేసే అన్ని విషయాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తామని అన్నారు. అనంత అర్బన్ అభివృద్ధి విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రూ.35 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని అన్నారు.

విద్యుత్ సమస్యలు ఉండకూడదు

అర్బన్ నియోజకవర్గం పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థ, ఎన్‌హెచ్‌పీఆర్ అధికారులతో సమావేశమ య్యారు.

రెండేళ్లకు వెలుగులు


అనంతపురం-కదిరి హైవే పై వెలుగులు

అనంతపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంగల్ రోడ్డు నుంచి ఇటుకలపల్లి వరకు అలుముకున్న చీకట్లు రెండేళ్ల తరువాత తొలగిపోయాయి. కదిరి-అనంతపురం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు అధికారులు బుధవారం రాత్రి వెలిగించారు. దీంతో జాతీయ రహదారిపై వెలుగు విరజిమ్ముతున్నాయి. వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లైట్లు వెలగక రెండేళ్ల గడిచినా అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టలేదు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది.

అంధ జంటకు వివాహం


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తదితరులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): పుట్టుకతో చూపులేని ఇద్దరికి సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వివాహం జరిపించారు. డి.హీరేహాళ్ మండలకేంద్రానికి చెందిన లోకేశ్, తెలంగాణలోని కొమురంభీం జిల్లా సిర్పూర్ తాలూకా అచ్చల్లి గ్రామానికి చెందిన రాథోడ్ సాను అంధులు. వీరికి వివాహం జరిపించాలని జిల్లా అంధ ఉద్యోగుల సంఘం నాయకులు సాయి ట్రస్టును ఆశ్రయించారు. దీంతో తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో ట్రస్టు సభ్యులు హిందూ సంప్రదాయంలో వివాహం జరిపించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, చిన్మయ జగదీశ్వరాలయం స్వామి ఆత్మవిదానంద సరస్వతి వధూవరులను ఆశీర్వదించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అపోపా నాయకుడు జయంతి శ్రీనివాసులు శెట్టి, ఆపద్బంధు సహాయ ట్రస్టు ఉపాధ్యక్షుడు శంకరప్ప, లింగమయ్య, గోపాల్, జయచంద్రారెడ్డి, ఎస్కేయూ ప్రొఫెసర్ సీఎస్ రాయుడు, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాల్లో ప్రజలను చేర్చండి: కలెక్టర్


బీమా పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

అనంతపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనాలు కల్పించే కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల్లో ప్రజలను చేర్పించాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. బ్యాంకర్లు, డీఆర్డీఏ, పంచాయతీరాజ్, నాబార్డు, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. సభ్యత్వం తీసుకున్నవారు సాధారణంగాగానీ, ప్రమాదంలోగానీ మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారం వస్తుందని తెలిపారు. ఈ పథకాల గురించి మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా తెలిసేలా చూడాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయశాఖ సిబ్బందిని ఇందుకోసం వినియోగించుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ మందికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పథకాల ప్రగతిపై ప్రతివారం నివేదిక అందజేయాలని సూచించారు. నవంబరు 19లోగా నిర్దేశించిన లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు కృషిచేయాలని ఆదేశించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా కొన్ని గ్రామాలలో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను కోరారు.

ఇళ్ల నిర్మాణంలో అవినీతిపై చర్యలు

ఎమ్మెల్యే పరిటాల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరిట అక్రమాలకు పాల్పడినవారిని వదిలేది లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గృహ నిర్మాణ, రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ హౌసింగ్ వెరిఫికేషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, బీఎల్‌సీ హౌసింగ్ గురించి మండలాల వారీగా ఆరా తీశారు. రాచానపల్లి, ఆలమూరు కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రాక్రీట్ సంస్థకు అనుమతి ఇచ్చారని, ప్రకాష్‌రెడ్డికి చెందిన ఆ సంస్థ అనేక అక్రమాలకు పాల్పడిందని అఅన్నారు. వీటిపై విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతోందని అన్నారు. నగర శివారు కాలనీలలో పేదలకు కాకుండా కార్లలో వచ్చే వారికి, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఇళ్లు ఇచ్చారని అన్నారు. వాటిని చాలామంది అమ్ముకున్నారని, సమగ్రంగా విచారించాలని అధికారులను ఆదేశించారు. పండమేరు, నడిమి వంకలో పట్టాలు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారి పరిస్థితి ఏమిటని అడిగారు. వారికి సాయం చేసేందుకు అవకాశం ఉందా, పండమేరు సరిహద్దులను గుర్తించే అవకాశం ఉందా అని ఆరా తీశారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు వారు నష్టపోతున్నారని, శాశ్వత పరిష్కారం చూపాలని హౌసింగ్, రెవెన్యూ అధికారులకు సూచించారు. వంక ప్రాంతంలో పట్టాలు ఎవరు ఇచ్చారు, స్థలాలను ఎవరు అమ్మారో విచారించాలని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని అధికారులను ఆదేశించారు. రాప్తాడు, రూరల్ మండలాల జగనన్న కాలనీలో స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలపై విచారించాలని సూచించారు. కొడిమి జర్నలిస్టు కాలనీ ఇంటి స్థలాల వివరాలు, వివాదాల గురించి ప్రశ్నించారు. జర్నలిస్టులు కాని వారు అక్కడ ఇళ్ల నిర్మాణాలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణం జరిగే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

సమావేశంలో అనంత పురం హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ శైలజ, శ్రీసత్యసాయి జిల్లా పీడీ వెంటనారాయణ, డీఎల్‌పీఓ లలితాబాయి, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ నాయకులు పంపు కొండప్ప, జింకా సూర్యనారాయణ, సుధాకర్, ముత్యాల్‌రెడ్డి, యాతం పోతులయ్య, శ్రీనివాసులు, దగ్గుపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాటం చేస్తాం

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి


గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు గుప్పించిన అనేక హామీలను నెరవేర్చేంత వరకూ కూటమి ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామని డీసీసీ అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఆ పథకాలన్నింటినీ అమలు చేసే వరకు తాము ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గ సమస్యలపై స్థానికంగా పోరాడాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నరసింహులు, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



తూర్పు.. పడమర..!

ముసిరిన చీకట్లు..
పడమటి సంధ్యవి కాదు
లేలేత పసిడి వెలుగులు..
తూరుపు దిక్కున కాదు
కనిపించేదంతా నిజం కాదు..!
ఒక్కోసారి..
చూపులు మోసగిస్తాయి..!
ఆలోచించి.. శోధించి..
నిజమేమిటో నిర్ధారించుకోవాలి..!

(అనంతపురం క్లాక్ టవర్ పై ఓవర్ బ్రిడ్జిపై.. గురువారం ఉదయం.. ఏకకాలంలో తూర్పున మసక చీకటి.. పడమట వెండి వెలుగులు)



చిరునామా చిక్కులు...!

ఆధార్‌లో అడ్రస్ మార్పునకు గెజిటెడ్ సంతకాలతో తిప్పలు

తహసీల్దార్ సంతకాలకే అంగీకారం..లేదంటే దరఖాస్తుల తిరస్కారం

లబ్ధిదారులకు తప్పని తిప్పలు

పథకాలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, బడికెళ్లినా, గుడికెళ్లినా ఎక్కడైనా ఆధార్ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మరణానికి, జననానికి ఇలా ప్రతి దానికి ఆధార్‌ను అనుసంధానం చేశారు. అయితే ఆధార్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఉడాయ్ నిబంధనల మేరకు పేర్ల మార్పు, పుట్టిన తేదీల మార్పు, చిరునామాల మార్పు, ఫొటో, బయోమెట్రిక్ తదితర అన్ని అంశాలకు అవకాశం కల్పించారు. అయితే ఏ మార్పు చేయాలన్నా సరైన ప్రూఫ్ తప్పనిసరి. అసలు చిక్కంతా అడ్రస్ మార్పుతోనే వచ్చింది. ఎవరైనా ఇళ్లు మారినా, ఊరు మారినా ఆధార్‌లో అడ్రస్ మార్చుకోవాలి. ఆ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం తప్పనిసరి చేశారు. అందులో పలు రకాల గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు చేయవచ్చని పేర్కొనప్పటికీ కేవలం తహసీల్దార్ సంతకాన్ని మాత్రమే అంగీకరిస్తుండంతో అసలు సమస్య మొదలయ్యింది. ఇతర అధికారులతో సంతకం చేయిస్తే ఆ దరఖాస్తులు తిరస్కరిస్తుండంతో లబ్ధిదారులకు పాట్లు తప్పడం లేదు.

- అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆంధ్రజ్యోతి



ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరిన కార్డుదారులు (ఫైల్)

జాబితాలో ఎందరో ఉన్నా..

నిబంధనల మేరకు అడ్రస్ మార్పు చేసుకునే దరఖాస్తులో గెజిటెడ్ అధికారుల జాబితాలో గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-ఎ, విలేజ్ పంచాయతీ హెడ్ ఆఫ్ ముకియా, గెజిటెడ్ ఆఫీసర్ గ్రూప్-బీ, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ కౌన్సిలర్, తహసీల్దార్, హెడ్ ఆఫ్ రికజ్నైజ్డ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్, సూపరింటెండెంట్, వార్డెన్, మ్యాట్రన్, హెడ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రికజ్నైజ్డ్ షెల్టర్ హోమ్స్, ఆర్ఫనేజెస్, ఈపీఎఫ్ఓ ఆఫీసర్ల హోదాలను పొందుపరిచారు. అయితే వీటిలో ఏ ఒక్క అధికారి సంతకాన్ని చేయించుకొని ఆధార్ సెంటర్‌లో నమోదు చేయించినప్పటికీ... వారం, పదిరోజులకు అప్లికేషన్ తిరస్కరించినట్లు మొబైల్‌కు మెసేజ్ వస్తోంది. కేవలం తహసీల్దార్ సంతకాలతో కూడిన వాటికే అడ్రస్ మార్పులు జరుగుతుండంతో దరఖాస్తుదారులు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరగక తప్పడం లేదు.

సంతకాలంటే జంకుతున్నారు..

ఆధార్‌లో సంతకాలు చేయాలంటే గెజిటెడ్ అధికారులు బెంబేలెత్తుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. గతంలో జిల్లాలోని పలువురు తహసీల్దార్ల సంతకాలతో ఆధార్‌లో అడ్రస్‌లు మార్చుకున్న కొందరు వాటిని దుర్వినియోగం చేయడమే దీనికి ప్రధాన కారణం. ఆధార్‌లో చిరునామాలను మార్చుకొని కొందు భూ కబ్జాలు చేసినట్లు చేసినట్లు సమాచారం. మరికొందరు డబుల్ రిజిస్ట్రేషన్లు తదితర అక్రమాలకు పాల్పడిన దాఖలాలూ ఉన్నాయి. దీంతో సంతకాలు పెట్టాలంటే అధికారులు జంకుతున్నారు. మరికొందరు అధికారులైతే సరైన ఆధారాలు, అడ్రస్ ఎందుకు మారుతున్నారు తదితర వివరాలపై ఆరా తీసి సంతకాలు చేస్తున్నారు.

వార్డెన్‌తో సంతకం చేయించినా రిజెక్ట్ అయ్యింది...



ఆధార్ కార్డులో అడ్రసు మార్చుకోవాలని దరఖాస్తులో గెజిటెడ్ సైన్ ఆఫీసర్ల లిస్టులో వార్డెన్ ఆప్షన్ ఉంటే... నాకు తెలిసిన హాస్టల్ వార్డెన్‌తో సంతకం చేయించి అనంతపురం పోస్టాఫీసులో ఇచ్చాను. అయితే పదిరోజులకు అప్లికేషన్ రిజెక్ట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అధికారులను అడిగితే తహసీల్దార్‌తోనే సంతకం చేయిచాలంటున్నారు. ఇప్పటికైనా నిబంధలను మార్చి అందరు అధికారుల సంతకాలు చెల్లేలా అవకాశం కల్పించాలి. - **శ్రీనివాసులు, ధర్మవరం**

మా ఊళ్లో హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయించా...



నా ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఆధార్ సెంటర్‌కు వెళ్లాను. ఒక ఫారం ఇచ్చారు. అందులో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించుకొని రమ్మన్నారు. మా ఊళ్లో స్కూల్ హెచ్‌ఎంతో సంతకం పెట్టించుకుని వచ్చాను. అప్లై చేసిన వారం రోజులకు దరఖాస్తు తిరస్కరించినట్లుగా మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఇదేమని అడిగితే ఎమ్మార్వో సంతకం చేయించమని చెప్పారు. మా ఊళ్లోకి వెళ్లి అడిగితే వాళ్లు చేసేది లేదంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

- **అరుణ్‌కుమార్, గార్లదిన్నె**

నేటి నుంచి పశుగణన

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి 21వ భారత పశుగణన సర్వే ప్రారంభం కానుంది. ఇదివరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి సర్వే చేయాలని నిర్ణయించినా, కొన్ని సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. శుక్రవారం నుంచి నాలుగు నెలలపాటు సర్వే కొనసాగనుంది. పశుగణన సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 189 ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను నియమించారు. ప్రతి ఐదేళ్లకోమారు పశుగణన సర్వే జరుగుతోంది. శుక్రవారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పశుగణన సర్వే ప్రారంభిస్తున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. నాలుగు నెలలపాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి : డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జీఈఎ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టడానికి తగిన విధంగా నిధులు కేటాయించడం జరిగింది. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్ సూచించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల వినియోగంపై ఉమ్మడి జిల్లా అటవీశాఖ సిబ్బందికి గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలోని సమావేశ భవనంలో వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వినోద్‌కుమార్, సబ్‌డీఎఫ్ఓ, అనంతపురం ఇంచార్జ్ డీఎఫ్ఓ ఆనంద్ హాజరై సిబ్బంది విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో డీఆర్‌డీఏ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాలోని డీఆర్వోలు ఉసేనప్ప, చాప్లనాయక్, దీప, దామోదర్‌రెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్‌లో మట్టి తరలింపు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేంజ్ పరిధిలో శింగనమల బీట్‌లోని తరిమెల సమీపంలో అటవీశాఖ స్థలం నుంచి స్థానికులు గురువారం మట్టి తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక బీట్ అధికారి తేజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన సమాచారంతో స్పందించిన రేంజర్ శ్రీనివాసులు, సెక్షన్ అధికారులు అక్బర్, ప్రవీణ్‌కుమార్‌ను క్షేత్రస్థాయికి వెళ్లి వాహనాలను సీజ్ చేశారు. అపరాధ రుసుం చెల్లించిన అనంతరం వాటిని విడుదల చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జంగాలపల్లిలో వర్షాలకు దెబ్బ వేరుశనగ పంటను గురువారం సీపీఎం మండల కార్యదర్శి రామాంజినేయులు ఆధ్వర్యంలో పరిశీలించారు. అధిక వర్షాల నల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి పోతులయ్య, రైతులు నరేష్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పెద్ద పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా మల్లోల

అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా మల్లోల నియమితులయ్యారు. గురువారం రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను, ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో మల్లోలను అనంతపురానికి నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో అనంతపురం ఆర్డీఓ గా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడున్న డీఆర్ఓ రామకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడిలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 20.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు 17.4, తాడిపత్రి 11.2, రాప్తాడు 10.0, గార్లదిన్నె 9.4, వజ్రకరూరు 9.2, గుత్తి 8.0, గుంతకల్లు 7.2, యాడికి, పెద్దపప్పూరు 5.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగ తా మండలాల్లో 3.0మి.మీ. లోపు నమోదైంది.

గంటన్నరపాటు లిఫ్టులోనే రోగులు



అనంతపురం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమానికమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహణ అధ్వానంగా ఉందనడానికి గురువారం చోటు చేసుకున్న లిఫ్టు ఘటనే నిదర్శనం. చికిత్సకోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లిన నడవలేని ఐదుగురు రో గులు లిఫ్టు ఎక్కారు. అది మధ్యలోనే ఆగిపోయింది. దాదాపు గంటన్నరపాటు ఆ రోగులు లిఫ్టులోనే ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత మెకానిక్‌లు వచ్చి లిఫ్టు తాళంతో తెరవడంతో బయటకు వచ్చి ఊపిరి పీల్చుకున్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో లిఫ్టును తెరుస్తున్న ఎలక్ట్రిసిటీ సిబ్బంది, లిఫ్టులో ఇరుక్కుపోయిన పేషెంట్లు బయటకు వస్తున్న దృశ్యం

తుస్సుమన్న సమావేశం

అనంతపురం క్రైం, అక్టోబరు 24 : పారిశుధ్య కార్మికుల సమస్యలపై మున్సిపల్ యూనియన్ వర్కర్స్ నాయకులతో పాలకవర్గం, అధికారులు నిర్వహించిన సమావేశం తుస్సు మంది. మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య, కమిషనర్ నాగరాజుతో కలిసి సమావేశమయ్యారు. యూనియన్ నాయకులు వెంకటనారాయణ, ఏటీఎం నాగరాజు, నాగభూషణ సమస్యలు వివరించారు. వాటిపై పాలకవర్గం, అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవటంతో యూని యన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ గురువారం కొనసాగింది. ఇప్పటి దాకా 14835 మంది రైతులు 21009 క్వింటాళ్ల పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో ఇప్పటి దాకా 20669 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు.

మున్సిపల్ స్థలాలను కాపాడండి

కమిషనర్‌కు సీపీఐ నేతల వినతి

అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ స్థలాలను కాపాడాలని సీపీఐ నాయకులు నగర కమిషనర్ నాగరాజును కోరారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ నాయకులు కమిషనర్‌ను ఆయ న చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రూ. వంద కోట్ల విలువ చేసే ఏడెకరాల నగరపాలక సంస్థ స్థలం అన్యాక్రాంతం అవుతోందన్నారు. 2019-2024 మధ్య కాలంలో వైసీపీ నేతలు ఈ స్థలంలో అక్రమ కట్టడాలు కట్టారన్నారు. అలాగే ఖాజానగర్, శ్రీనగర్ కాలనీ తదితర చోట్ల కోట్ల విలువైన ఓపెన్ స్థలాలు సైతం కబ్జా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లిపీరా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భయోమెట్రిక్!

ఎస్సీ హాస్టల్స్‌కు 'మాన్యువల్' సమస్య



ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం



బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

- వైసీపీ హయాంలో ఆ రిజిస్టర్ తొలగింపు
- బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయకపోవడంతో వార్డెన్ల ఇబ్బందులు
- వేలిముద్రలు పడని సమయంలో సొంత నిధులతో మెనూ అమలు
- కాస్మెటిక్స్ చార్జీలు ఆన్‌లైన్ చేయడంతో విద్యార్థులకూ తప్పనితిప్పలు
- ఇదీ జిల్లాలో ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల పరిస్థితి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలకు మాన్యువల్ రిజిస్టర్ అందని ద్రాక్షలా మారింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలో బయోమెట్రిక్, మాన్యువల్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) రెండూ అమలు చేసేది. దీంతో బయోమెట్రిక్ సమస్య ఏర్పడిన సమయాల్లో మాన్యువల్ రిజిస్టర్ ఉండటంతో ఎక్కడా సమస్య లేకుండా సవ్యంగా సాగిపోయేది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణ ఎత్తేసి... బయోమెట్రిక్ మాత్రమే అమలు చేసింది. అయితే బయోమెట్రిక్ పనిచేయని సమయంలో వార్డెన్లు పలు ఇబ్బందులు పడేవారు. అప్పట్లో ఈ సమస్యను గమనించిన బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మాన్యువల్‌ను కొనసాగించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకున్నారు. అయితే ఎస్సీ వెల్ఫేర్‌లోని కొందరు అధికారులు దీన్ని నిర్లక్ష్యం చేశారు. దీంతో బయోమెట్రిక్, ఐరిష్ పనిచేయని సమయంలో ఆ వార్డెన్ల బాధలు వర్ణణాతీతం. తాజాగా... పలు హాస్టళ్లలో బయోమెట్రిక్ పనిచేయకపోవడంతో దాదాపు పదుల సంఖ్యలో విద్యార్థులకు వార్డెన్లు సొంత ఖర్చులతోనే మెనూ అమలు చేయాల్సి వస్తోంది. ఆ సొమ్ము తమకు ఎవరు చెల్లిస్తారని... తమ జీతాన్ని సైతం ఖర్చు చేయా ల్సి వస్తోందని ఆ వార్డెన్లు మండిపడుతున్నారు. ఇప్పటికే డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం... మాన్యువల్ లేకపోవడం... తదితర సమస్యలతో సతమతమవుతున్న తమకు ఈ బయోమెట్రిక్ మరో సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యం ఆయా సంక్షేమశాఖల రాష్ట్రస్థాయి అధికారులు మారడంతో మాన్యువల్ రిజిస్టర్ నిర్వహణను మళ్లీ అమల్లోకి తీసుకొస్తారని ఎస్సీ సంక్షేమశాఖ వార్డెన్లు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మొరాయిస్తున్న బయోమెట్రిక్, ఐరిష్ ...

ఎస్సీ సంక్షేమశాఖ వసతి గృహాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలు చేస్తున్నారు. వార్డెన్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలతోనే రిజిస్టర్ నమోదు చేస్తున్నారు. ఆ యంత్రాలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అందజేసినవే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, ఐరిష్‌లు అందించిన పాపాన పోలేదు. కాగా ఎక్కువ కాలం కావడంతో ఆ యంత్రాలు మొరాయిస్తున్నాయి. గత ప్రభుత్వంలో పలుమార్లు బయోమెట్రిక్, ఐరిష్ యంత్రాలు ఇవ్వాలని మొర పెట్టుకున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా వాటిని తరచూ రిపేరీలు చేయించుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆ యంత్రాల్లో బయోమెట్రిక్ పదుల సంఖ్యలో విద్యార్థులకు పడకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు.

విద్యార్థులకు కాస్మెటిక్ తిప్పలు...

ఈ వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలను ప్రభుత్వమే అందిస్తోంది. 3 నుంచి 6వ తరగతి వరకు ఒక్కో బాలుడికి రూ. 125, బాలికకు రూ. 130, 7వ తరగతి నుంచి 10వ తరగతి బాలుడికి రూ. 150, బాలికకు రూ. 200, ఇంటర్మీడియట్.. ఆపై ఉన్న విద్యార్థికి రూ. 200, విద్యార్థినికి రూ. 250 ప్రకారం కాస్మెటిక్స్ చార్జీలను అందిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు నేరుగా వారి చేతికి నెలనెలా ఈ డబ్బులు అందించేది. దీంతో విద్యార్థులు తమకు కావాల్సిన కాస్మెటిక్స్‌ను నేరుగా కొనుగోలు చేసుకునేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నగదును విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసేలా నిర్ణయించింది. గడిచిన ఐదేళ్ల కాలంలో పలు హాస్టళ్లలోని విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో... ఆరు నెలలు... మరికొన్ని చోట్ల సంవత్సరంపైగా కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉంచారు. ఇలా గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న కాస్మెటిక్స్ ఆన్‌లైన్ విధానంతో వందల సంఖ్యలో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

రూ. వేలల్లో నష్టం ...

బయోమెట్రిక్, ఐరిస్ యంత్రాలు పనిచేయని సందర్భాల్లో వార్డెన్ల సమస్యలు అన్నీఇన్నీ కావు. ఒక్కో విద్యార్థికి రోజుకు 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 40, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 46, కాలేజీ ఒక్కో విద్యార్థికి రూ. 53 (భోజనం ఖర్చు)పైగానే వస్తుంది. ఈ లెక్కన ఒక రోజుకు 20 మంది విద్యార్థులకు బయోమెట్రిక్ పడకపోయినా... రూ. 1000లకు పైగా వార్డెన్ చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇలా రెండు.. మూడు రోజులు బయోమెట్రిక్ పనిచేయలేదంటే.. దాదాపు రూ. 3 నుంచి రూ. 4 వేలు ఆ వార్డెన్ నష్టపోవాల్సి వస్తోంది.

మాన్యువల్‌కు అనుమతి ఇవ్వాలి ...

ఎస్సీ హాస్టళ్లకు మాన్యువల్ లేకపోవడంతో వార్డెన్లు తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు జరిగే సమయంలో అథెంటికేషన్ కాని సమయంలో వార్డెన్లు చేతి నుంచి ఖర్చులు పెట్టుకొని భోజనం పెట్టాల్సి వస్తోంది. మాన్యువల్ ఉంటే అటు విద్యార్థులు... ఇటు వార్డెన్లకు సమస్య ఉండదు. నెట్ సరిగ్గా లేకపోయినా.. సర్వర్ బిజీగా ఉన్నా.. సెలవుల్లో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి మళ్లీ హాస్టళ్లకు వచ్చినప్పుడు ఫింగర్ ప్రింట్లు పడవు. ఈ సమస్యలన్నీ దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర అధికారులు మాన్యువల్‌ను అమలు చేయాలి.

- రాముునాయక్, ఎస్సీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

రబీ నుంచి పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రబీ సీజన్ నుంచి పంటల బీమా వర్తింపు కోసం రైతులు నిర్దేశించిన ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలిసి కలెక్టర్, జేసీ, జిల్లా వ్యవసాయాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది రబీ నుంచి రాబోవు సీజన్లల్లో రైతులు స్వయంగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే రైతులు తప్పని సరిగా బ్యాంక్‌ల ద్వారా ప్రీమియం కట్టాల న్నారు. మిగిలిన రైతులు సీఎస్‌సీ (మీసేవ) లేదా ఇన్సూరెన్స్ కంపెనీ లేదా ఎన్‌సీఐ ద్వారా ప్రీమి యం చెల్లించాలన్నారు. బీమా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, భూమి వివరాలు, వన్‌బీ, పంట సాగు ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్, ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ నెంబర్‌లను బ్యాంకు లేదా మీసేవ కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. జిల్లాలో దిగుబడి ఆధారిత పంటల బీమా కింద పప్పుశనగ పంటకు గ్రామ యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న పంటలను మండల యూనిట్‌గా ఇచ్చారన్నారు. వరి మినహా మిగతా పంటలకు డిసెంబరు 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాల న్నారు. వరికి డిసెంబర్ నెలాఖరుదాకా గడువు ఉందన్నారు. పప్పుశనగకు హెక్టారుకు రూ.1125, వరికి రూ.1575, జొన్నకు రూ.788, మొక్కజొన్నకు రూ.1313, వేరుశనగకు రూ.1200 ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ బీమా కింద టమోటాను ఎంపిక చేశారని తెలిపారు. టమోటాకు హెక్టారుకు రూ.4వేలు ప్రీమియం ప్రకారం డిసెంబరు 15లోగా చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులు తప్పని సరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రబీ పంటల బీమాపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

క్రైంకార్నర్

అత్తను కాపాడి.. కోడలు మృతి


అలివేలమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో చిక్కుకున్న అత్త ను కాపాడి, కోడలు మరణించింది. మండలంలోని మరువపల్లిలో విద్యుదాఘాతంతో చాకలి రామచంద్రప్ప భార్య అలివేలమ్మ (43) గురువారం మరణించింది. గ్రామస్థు లు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉతికిన గుడ్డలు అరబెట్టేందుకు అలివేలమ్మ అత్త రామాంజినమ్మ మిద్దెపైకి వెళ్లింది. దుస్తులు ఆరబెట్టే సమయంలో ఇంటికి ఆనుకునే వెళ్లిన విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు తగిలింది. షాక్ కొట్టడంతో ఆమె కేకలు పెట్టింది. అక్కడే ఉన్న ఆమె కోడలు అలివేలమ్మ కట్టెతో విద్యుత్ తీగలను కొట్టింది. రామాంజినమ్మ ప్రాణాలతో బయటపడింది. విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాపిడై, అలివేలమ్మ మీదకు రావడంతో ఆమెకు షాక్ తగిలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. రామాంజినమ్మ స్వల్పగాయాలతో బయటపడింది. రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అలివేలమ్మ మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కాటేసిన నిర్లక్ష్యం

మరువపల్లిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయనీ, మిద్దెలపై వెళ్లాయనీ, వాటిని మార్చాలని రెండు నెలల నుంచి గ్రామస్థులు.. ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందని గ్రామస్థులు మండిపడ్డారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

విద్యుదాఘాతంలో అలివేలమ్మ మృతిచెందడంతో ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న బాధిత కుటుంబీకులను మంత్రి ఫోన్‌లో పరామర్శించారు. అధైర్యపడకండనీ, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ట్రాన్స్‌కో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మండలంలోని రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు.. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేశారు.

ప్రభుత్వోద్యోగం రాలేదని ఆత్మహత్య

అనంతపురం క్రైం, అక్టోబరు 24: ప్రభుత్వ ఉద్యోగం రాలేదన్న మనస్థాపంతో ఓ జూనియర్ న్యాయవాది రుక్సానా(27) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రుష్యేంద్రబాబు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురానికి చెందిన రుక్సానా తన ఇద్దరు చెల్లెళ్లు రేష్మా, కౌసర్‌తో కలిసి నగరంలోని పటేల్‌రోడ్డులో ఓ గది అద్దెకు తీసుకుని జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తోం ది. తల్లిదండ్రులు, తమ్ముడు సిద్ధరాంపురంలో ఉన్నారు. కొంత కాలంగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. ఉద్యోగం రాకపోవడంతో అదే ఆలోచనతో ఉండేది. గురువారం మధ్యాహ్నం తన చెల్లెళ్లు బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెల్లెళ్లు ఇంటికి వచ్చి చూసి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో రిమాండ్

గార్లదిన్నె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పోక్సో, హత్యాయత్నం కేసులో గౌస్‌పీరా అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపిన మేరకు, మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన గౌస్‌పీరా వేధిస్తున్నాడు. వారం క్రితం బాలిక కుటుంబ సభ్యులు గ్రామస్థు లు మందలించారు. దీంతో గౌస్‌పీరా బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులపై కొడవలి తో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేర కు గౌస్ పీరా పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

బడి భోజనం.. బాగుండాలని..

- మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు అడుగులు
- మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- ఎస్ఎంసీల సూచనలు పరిగణనలోకి..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని కొందరు విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అస్సలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. దుడ్డుబియ్యంతో అన్నం... రుచితో పాటు ఇష్టమైన కూరలే లేక పోవడంతో విద్యార్థులు.. బడి భోజనంపై అయిష్టత చూపుతున్నారు. దీనిపై అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా అన్నం తినేలా మధ్యాహ్న భోజన పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా మార్పులకు సిద్ధమైంది. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా సాగిన మధ్యాహ్న భోజన పథకం అమలును గాడిలో పెట్టేలా కూటమి సర్కారు కార్యాచరణ చేపట్టింది.
- ధర్మవరం, ఆంధ్రజ్యోతి

జిల్లాలో ప్రాథమిక 1563, ప్రాథమికోన్నత229, ఉన్నత పాఠశాలలు 315 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,42,540 మంది విద్యార్థులున్నారు. వీరిలో 20 శాతం మంది విద్యార్థులు వివిధ కారణాలతో బడిలో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాల గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల కలెక్టర్ స్థాయిలో సమీక్ష నిర్వహించింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులు, భోజనం చేసే వారి సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేశాయి. వాటిని పరిగణనలోకి తీసుకుని, పథకంలో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది. వీటిలో ఏమేరకు అమలు చేస్తారోనన్న చర్చ సాగుతోంది.


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రత్యేక మెనూ ఇంకా అమలుకాలేదు

ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో మార్పులు చేయనుంది. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నవంబరులో మధ్యాహ్న భోజన మెనూపై ఏజెన్సీ నిర్వాహకులతో ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేసి, నాణ్యత వివరాలను పరిశీలించనున్నారు. ప్రస్తుతం మెనూ ఇంకా అమలు కాలేదు.
- రామకృష్ణ, విద్యాశాఖ ఏడీ

కమిటీల సూచనలు

- మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలి. పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్‌రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలికూడా తినడంలేదు. దీనిలో కూడా మార్పులుచేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావ నాణ్యతగా ఉండటం లేదు. ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలుగానీ, పాలుగానీ ఇవ్వాలి.
- అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, కోడిగుడ్లు సరఫరా చేయాలి.
- ఏజెన్సీలకు ఏ నెలకానెల బిల్లులు చెల్లించడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజెన్సీలకు అప్పుల బాధ తప్పుతుంది.

నాలుగేళ్లకే నాట్యం

భరతనాట్యంలో రాణిస్తున్న పురంవాసి

జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు


నృత్య భంగిమలో చంద్రబాను చతుర్వేది

కళ

హిందూపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుడి బుడి అడుగులు వేసే చిరు ప్రాయంలోనే ఆమె పాదం నర్తించింది. భరతనాట్యమే ఊపిరిగా పెరిగింది. అనతికాలంలోనే అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలిచ్చింది. ఎన్నో పతకాలు, బహుమతులు కైవసం చేసుకుని, భళా అనిపించింది. ఆమే హిందూపురం సదాశివనగర్‌కు చెందిన చంద్రబాను చతుర్వేది. ఉమ్మడి జిల్లాలో ఆమె పేరు తెలియని నాట్య కళాకారులు లేరంటే అతియోశక్తి కాదు. తల్లి మణరత్నకుమారి కోరిక మేరకు 2006లో నాలుగేళ్ల వయసులో భరత నాట్యం వైపు చంద్రబాను అడుగులు వేసింది. విజయవాడకు చెందిన ఘంటశాల పవన్‌కుమార్ వద్ద నాట్య పాఠాలు నేర్చుకుంది. తరువాత ఇండియాబుక్ ఆఫ్ రికార్డ్స్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కైవసం చేసుకుంది. 2019లో తెలంగాణ ప్రభుత్వం స్వర్ణనంది అవార్డుతో సత్కరించింది. విజయవాడలో నిర్వహించిన నాట్యపోటీల్లో ప్రతిభ చాటిన చతుర్వేదికి రాష్ట్ర ప్రభుత్వం యువరత్న అవార్డు ప్రదానం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా ఆమెను ఎంపిక చేశారు. ఎన్నో అవార్డులు, పతకాలు సాధించారు.

నాట్యాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలన్నదే లక్ష్యం



అంతరించిపోతున్న దేశ కళల్లో ఒకటైన భరతనాట్యాన్ని దేశవిదేశాల్లో ప్రదర్శించి, విశ్వవ్యాప్తం చేయాలన్నదే తన లక్ష్యమని చంద్రబాను చతుర్వేది తెలిపారు. ఆ దిశగా అభిజ్ఞ నృత్యాలయం స్థాపించారు. ఇప్పటి వరకు 76 మందికి నాట్యం నేర్పినట్లు ఆమె చెప్పారు. ఆన్‌లైన్‌లో విదేశాల వారికి సైతం నాట్యపాఠాలు చెబుతున్నట్లు ఆమె వెల్లడించారు.

విజయవాడకు కనెక్టివిటీ పెరుగుతుంది

రైల్వే డివిజనల్ మేనేజర్ విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ), రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిన రెండు భారీ ప్రాజెక్టులతో రాష్ట్రానికి, గుంతకల్లు రైల్వే డివిజన్‌కు మేలు కలుగుతుందని గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజరు విజయకుమార్ అన్నారు. రెండు భారీ ప్రాజెక్టుల విషయంపై రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లు డీఆర్ఎం చాంబర్ నుంచి రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రెండు రైల్వే ప్రాజెక్టుల వల్ల రాష్ట్ర రాజధాని అమరావతితో కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు. ఎర్రుపాలెం-నంబూరు మధ్య రూ.2,247 కోట్లతో 57 కి.మీ. లైన్ నిర్మాణం వల్ల విజయవాడ, గుంటూరు జిల్లాల మీదుగా హైదరాబాదు, చెన్నై, కలకత్తాకు అమరావతితో కనెక్టివిటీని పెరుగుతుందని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న డీఆర్ఎం

ఈ ప్రాజెక్టు కారణంగా ఉత్తర, దక్షిణ భారత దేశం మధ్య అనుసంధానం మెరుగుపడుతుందని అన్నారు. కృష్ణా నదిపై 3.2 కి.మీ. వంతెనను నిర్మిస్తారని అన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల ప్రయాణికుల చేరవే, సరుకు రవాణా మెరుగుపడుతుందని అన్నారు.

చెరువులను పునఃపరిశీలించండి

అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

కనగానపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఆకస్మిక వరదలతో కనగానపల్లి చెరువు కట్ట తెగి పంటలు దెబ్బతిన్నాయని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న చెరువులన్నింటినీ పునః పరిశీలించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కనగానపల్లి చెరువు తెగి దెబ్బతిన్న పంటలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేశ్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఒకే రోజు 198.20 మి.మీ. వర్షపాతం నమోదు కావడం, భారీ వరదల కారణంగా చెరువు కట్టతెగిందని అన్నారు. చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని అన్నారు.

శాశ్వత పనులు చేపట్టండి: ఎమ్మెల్యే

కనగానపల్లి చెరువుకట్ట శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి పత్రం అందజేశారు. అనుకోని వర్షాలతో అపారనష్టం జరిగిందని, వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆమె అన్నారు. కుంటిమద్ది చెరువుతోపాటు మరిన్ని చెరువులు దెబ్బతిన్నాయని, వాటికి మరమతులు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని విన్నవించారు.


వరదనీటికి దెబ్బ తిన్న వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్యే పరిటాల సునీత

వధువు మాయం

తండ్రి కన్నీటి పర్యంతం



పత్తికొండ, అక్టోబరు 24: పెళ్లికి కొన్ని గంటల ముందు వధువు మాయమైంది. ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో వధువు తండ్రి కన్నీటిపర్యంతమయ్యారు. తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తి తన కూతురును క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన యువకుడి ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయం చేసుకున్నాడు. వివాహం గురువారం జరగాల్సి ఉంది. వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కర్నూలు జిల్లా పత్తికొండలోని వివాహ వేదికకు ముందురోజే చేరుకున్నారు. పెద్ద తాంబూలం కార్యక్రమాలు బుధవారం రాత్రి పూర్తి చేశారు. ఆ తరువాత పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో వధువుల కనిపించకపోవడంతో కంగారుగా చుట్టుపక్కల వెతికారు. తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఆమె కల్యాణ వేది నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. పెళ్లి నిలిచిపోయింది. కూతురు పెళ్లి ఘనంగా నిర్వహించి, ఆమెకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలనుకున్న తండ్రి ఈ పరిణామంతో కుంగిపోయారు. ఉబికి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మా ర్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.33 తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కె ట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపా రు. మార్కెట్‌కు గురువారం 1350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

సోషల్ మీడియా నేరాలపై స్పందించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్


మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అశ్లీలత, పరమత అసహనం, రెచ్చగొట్టే ధోరణులు, మోసాలపై ప్రభుత్వాలు స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐవైఎఫ్ పతాకాన్ని ఎగురవేసి.. రెండు రోజుల సోషల్ మీడియా వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆన్‌లైన్ మోసాలు పెచ్చుమీరుతున్నాయని, సోషల్ మీడియాలో రోజురోజుకూ అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టంగా నియంత్రించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే సామాజిక సమస్యలపై ఏఐవైఎఫ్ పోరాటాలు సాగిస్తుందని అన్నారు. ఏఐవైఎఫ్ 22వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ నాయకులు నాగరాయుడు, కత్తి రవి పాల్గొన్నారు.

29 నుంచి ఉద్యోగుల క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలు ఈనెల 29వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ షఫీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మహిళా, పురుషుల ఉద్యోగులకు 19 క్రీడల్లో రెండు రోజులపాటు పీటీసీ మైదానం, అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. 29న అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, యోగా, చెస్, టీటీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదే రోజు పీటీసీలో క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. 30వ తేదీ ప్రసన్నాయపల్లి సమీపంలో స్విమ్మింగ్, ఆర్డీటీ స్టేడియంలో లాన్‌టెన్నిస్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నవంబరు 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఆయాశాఖల అధికారుల నుంచి ధృవీకరణ పత్రాలతో ఈనెల 28వతేదీలోపు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలోని తమ శాఖ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబరు 8712622577ను సంప్రదించాలని కోరారు.

త్రైమాసిక పన్నులను పరివాహన్ ద్వారా చెల్లించాలి

జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు

అనంతపురం అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాహనదారులు త్రైమాసిక పన్నులను వాహన్ పరివాహన్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు గురువారం ప్రకటనలో కోరారు. ఇదివరకు వాహనాల పన్నులను ఏపీ ఆర్టీఏ సిటిజన్ ఈ ప్రగతి వెబ్‌సైట్ ద్వారా చెల్లించేవారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రవాణాశాఖ సేవలను వాహన్ వెబ్‌సైట్‌కు మార్చడం జరిగిందన్నారు. వాహనదారులు తమ వాహనాల త్రైమాసిక పన్నులను వాహన్ పరివాహన్ వెబ్‌సైట్‌లో మాత్రమే కట్టాలని సూచించారు.

ఐదేళ్లుగా నష్టపోయాం.. గట్టెక్కించండి

సీఎంను కోరిన ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో తీవ్రంగా నష్టపోయామని, గట్టెక్కించాలని సీఎం చంద్రబాబునాయుడును ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు కోరారు. గురువారం అమరావతిలోకి సచివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పీ సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దనగౌడ్.. సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. ఐదేళ్లుగా డీఏ అరియర్స్ బకాయిలు రాకుండా జగన్ మోసం చేశారన్నారు. క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను తగ్గించి ఎంతో మంది పెన్షనర్లు నష్టపోయేలా చేశారని పేర్కొన్నారు. మెడికల్ బిల్లులు రీయంబర్స్‌మెంట్ రాకుండా చేజేతులా డబ్బులు పెట్టుకొని వైద్యం చేయించుకునేలా జగన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల మీకున్న చిత్తశుద్ధిపై తమకు నమ్మకముందన్నారు. దీపావళి పండుగకు డీఏలు ప్రకటించాలని కోరారు. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు బదులుగా హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం ప్రవేశపెట్టాలన్నారు. అన్ని తన దృష్టిలో ఉన్నాయని, ఒక్కొక్కటిగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చినట్లు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ నాయకులు తెలిపారు. అంతకుముందు వరద బాధితుల కోసం తమవంతు బాధ్యతగా రూ. 1.50 లక్షల చెక్కును సీఎంకు వారు అందజేశారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న నాయకులు

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి

ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని

అనంతపురం కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సిబ్బందికి సూచించారు. గురువారం ఆర్ఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రీజియన్‌లోని అన్ని డిపోల డీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రయాణికులు చాలా వరకు శైవక్షేత్రాలకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తారని, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి బస్సు సర్వీసు పనితీరు, షెడ్యూల్ టైమింగ్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. బస్సులను సమయానుగుణంగా నడపాలని సూచించారు. సెక్టార్ వారీగా సర్వీసుల పనితీరును సమీక్షించి, బాగాలేని సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని కోరారు. సమీక్షలో డిప్యూటీ సీటీయం శ్రీలక్ష్మీ, అనంతపురం డీఎం నాగభూపాల్, జీఎల్ శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, బాలాజీ దయాల్, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎస్‌కే నాయక్, ఆర్వీ ప్రసాద్‌బాబు, ఎస్టీఐ నాగార్జున, ఏయంయఫ్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.


డీఎంలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్ఎం





నేడు భూ సమస్యల పరిష్కార వేదిక

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా రెవెన్యూ దర్బార్ - భూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేశ్, ఇతర అధికారులు హాజరవుతారన్నారు.





సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు

- సమావేశం నుంచి వెళ్లిపోయిన తహసీల్దారు


తహసీల్దారుతో వాగ్వాదం చేస్తున్న సీపీఐ నాయకులు, సర్పంచ్‌లు

నార్పల అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'నేను అవినీతికి పాల్పడను... ఎవ్వ రికి భయపడను ... 'అంటూ కోపంతో సర్వ సభ్య సమావేశం నుంచి తహసీ ల్దారు అరుణకుమారి వెళ్లి పోయారు. స్థానిక మండలపరిషత్ కార్యాల యంలో గురువారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. మొదట సిద్దిరాచర్ల సర్పంచ్ రామాంజినేయులు, సీపీఐ నాయకులు గంగాధర్ పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ... నార్పలతో పాటు పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ లే అవుట్లలలో ఎంతో మంది కబ్జా దారులు స్థలాలు ఆక్రమిసున్నా ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. దీంతో తహసీల్దారు అరుణకుమారి సమావేశం నుంచి కోపంతో వెళ్లి పోయారు. ప్రజాప్రతినిధులు సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వెళ్లి పోవటం ఏమిటని సభ్యులు ఆసహనం వ్యక్తం చేశారు.

వెంటనే పనులు ప్రారంభించండి

అనంతపురం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్య మెందుకు జరుగుతోందని..? నగర మేయర్ మహమ్మద్ వసీం ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన గురువారం తన ఛాంబర్‌లో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య, నగరకమిషనర్ నాగరాజుతో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, పూర్తి చేయాలని నగర కమిషనర్, ఎస్‌ఈని ఆదేశించారు

'వరద బాధితులకు అండగా ఉంటాం'

రాప్తాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు ఎమ్మెల్యే పరిటాల సునీత అండగా ఉంటారని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన మండలంలోని కళాకారుల కాలనీ, దండోరా కాలనీలోని ప్రజలకు గురువారం ఆయన బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను ఎమ్మెల్యే పరిశీలించి వారికి భోజన వసతి కల్పిస్తున్నారని, నిత్యావసర సరుకులు అందజేసున్నారని తెలిపారు. భవిష్యత్తు లో కాలనీలు ముంపునకు గురి కాకుండా ఎమ్మెల్యే ముందస్తు చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, సర్పంచులు తిరుపాలు, శశికళ, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈ బాధ్యతల స్వీకరణ

శింగనమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ శాఖ ఏఈగా విజయకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐదు నెలల కిందట ఇక్కడ పనిచేస్తున్న ఏఈ విజయ్ కుమార్ బదిలీ కాగా అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగానే ఉంది రైతులు ప్రజలు విన్నవించగా తాడిప్రతి ఏఈగా ఉన్న విజయకుమార్ శింగనమల ఏఈగా బాధ్యతలు స్వీకరించారు.

చెరువు తూముల మరమ్మతులు చేపట్టండి

శింగనమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీంతో ముందస్తుగా శింగనమల చెరువులోని తూములకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చెర్మన్ రాంచరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా రాంచరణ్ మాట్లాడుతూ... ఇప్పటికే భారీ వర్షాలకు చెరువులోకి కొద్దిపాటి నీరు చేరిందన్నారు. ఎక్కువ నీరు చేరితే తూములకు గండ్లు పడే అవకాశం ఉందన్నారు.



కంపచెట్ల తొలగింపు

శింగనమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం సమీపంలోని మరవకొమ్మ నుంచి గొవిందరాయునిపేటకు వరుకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి వాటిని తొలగించాలని ప్రజలు పలు మార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లిన స్పందన రాలేదు. దీంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లడంతో, అమె ఆదేశంతో గురువారం ఎంపీడీఓ నిర్మల కుమారి, సర్పంచ్ నాగమునెమ్మ ఆధ్వర్యంలో కంపచెట్లు తొలగించారు.

జాతీయ స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థిని మౌనిక జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ మహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరులో త్రిపురలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో మౌనిక పాల్గొంటుందని తెలిపారు.

క్విజ్ పోటీలు

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చెన్నేకొత్తపల్లి లోని పోలీస్ స్టేషన్‌లో గురువారం స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రాప్తాడు విద్యార్థులు

రాప్తాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు రాప్తాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపి కైనట్లు హెచ్‌ఎం సాంబ శివ తెలిపారు. అండర్- 19 త్రోబాల్ పోటీలకు నవ్యశ్రీ, కీర్తన, భవిత, హేమలత, దుర్గ రేవంత్, అండర్-19 ఖోఖోకు తనూజ్, అండర్-17 హ్యాండ్‌బాల్‌కు లోకరాజు, అండర్- 14 హ్యాండ్ బాల్ పోటీలకు చాణిక్య ఎంపికయ్యారని తెలిపారు.

పెన్నాలోని ఆక్రమణలను తొలగించండి

పామిడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలోని ఆక్రమణలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని పెన్నానది పరివాహక ప్రాంతాలను గురువారం ఆయన తహసీల్దార్ శ్రీధర్‌మూర్తితో కలిసి పరిశీలించారు. పెన్నానదికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను కొలిచి ఎవరెవరు ఎంతెంత ఆక్రమణలో ఉన్నారో నివేదికలు సమర్పించాలని తహసీల్దార్‌కు తెలిపారు. అలాగే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంటల సస్యరక్షణపై శిక్షణ

పామిడి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ఏఓ లీనావసుంధర ఆధ్వర్యంలో అక్కడి సిబ్బందికి పంటల సస్యరక్షణపై శిక్షణ జరిగింది. ఆత్మ పీడీ మద్దిలేటి హాజరై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా క్రాప్ లైఫ్ సిస్టెమ్ అనే ఆన్‌లైన్ యాప్ ప్రా ముఖ్యతను తెలిపి, ఆ యాప్ వినియోగంపై అవగాహకల్పించారు. పత్తి, వేరుశనగ, కంది తదితర పంటల్లో వచ్చే చీడపీడలు, పురుగులను ఎలా గుర్తించాలి, వాటి నివారణ ఏ చర్యలు చేపట్టాలో మానిటర్ ద్వా రా వివరించారు. ఏఈఓ శ్రీనివాసరావ్, డీఆర్‌సీ ఏఈఓ ప్రసాద్, ఎంపీఈఓలు , వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

యల్లనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన ఓ మట్కాబీటర్‌ను అరెస్టు చేశామని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసి మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని, అనంతరం అతడి నుంచి రూ. 30,200 నగదును, మట్కాపట్టీలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

తాడిపత్రి: పట్టణంలోని నందలపాడుకు చెందిన మట్కాబీటర్ అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి మట్కాబీటర్‌ను అరెస్టు చేశామని చెప్పారు.

పనుల కల్పనలో నిర్లక్ష్యం తగదు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం తగదని ఆ పథకం పీడీ సలీంబాషా తెలిపారు. పట్టణ సమీపంలోని డ్వామా కార్యాలయంలో గురువారం ఆయన ఐదు మండలాల ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పనులను పూర్తి చేయాలన్నారు. ఫారంపాండ్లు, గోకులం షెడ్ల ఏర్పాట్లు, నీటి కుంటలు, పల్లె వనాల పనులలో పురోగతిని పెంచాలని తెలిపారు. కూలీలందరికీ వందరోజుల పనులు కల్పించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఏపీడీ అయేషా, ఐదు మండలాల ఏపీఓలు, ఈసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైన్ షాపు ఎదుట ఘర్షణ

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్లారి మిట్ట మీద ఉన్న వైన్‌షాపు నిర్వహణలో కొంతమంది వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం వైన్‌షాపు ఎదుట కొంతమంది వ్యక్తులు ఘర్షణకు దిగి తోపులాటకు దారితీసింది. వైన్‌షాపునకు కూత వేటు దూరంలో డీఎస్పీ కార్యాలయం ఉండడంతో పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి దిగిన వారిని చెదరగొట్టారు. అంతటితో గొడవ సద్దుమణిగింది.

కోతకు గురైన వంతెన పరిశీలన

బ్రహ్మసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు భైరవాని తిప్ప ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో అధికారులు నీటిని గేట్ల ద్వారా నదికి వదులుతున్నారు. ఈ క్రమంలో వేదావతి నదికి వదలడంతో నీటి ఉధృతికి వేపులపర్తి, రాయదుర్గం వెళ్లే వంతెన కోతకు గురైంది. మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు వంతెనను గురువారం పరిశీలించారు. వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రాకపోకలు బంద్ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, మల్లి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రజ్వలన్ సృజన్ ఫెస్టివల్

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో గురువారం ప్రజ్వలన్ సృజన్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టుల నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. పలు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాటిని కళాశాల చైర్మన్ డీఏ మురళీకృష్ణ, కరెస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ గోపాల్ వైద్యురాలు సరోజమ్మ, కళాశాల కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు రామకృష్ణ నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ అధ్యాపకులు తదితరులు తిలకించారు.

హుండీ పగులగొట్టి నగదు చోరీ

గుత్తిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామశివారులో గల చంద్రమ్మ అమ్మవారి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీ పగలగొట్టి నగదు చోరీ చేశారు. రాత్రి సమయంలో ఆలయం తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ హుండీని పగులకొట్టిని అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. గత ఆరు నెలల నుంచి భక్తులు హుండీలో వేసిన కానుకలు సుమారు రూ. 40 వేలు వరకు ఉండవచ్చుని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

కుందుర్పి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో గురువారం రిషి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఎంఈఓ హరికృష్ణ బాలా జీ, ఎంఈవో తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీటీపీ నుంచి చెరువులకు నీటి విడుదల

● గంగమ్మకు జలహారతి ఇచ్చి విడుదల చేసిన కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ



బీటీపీ వద్ద గంగమ్మకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ

కళ్యాణదుర్గం రూరల్/ గుమ్మఘట్ట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు భైరవానితిప్ప ప్రాజెక్టు నీటితో నిండి నిండుకుండలా తొణికిసలాడుతోంది. కాగా గురువారం కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని గంగపూజ చేసి జలహారతి ఇచ్చి నీటిని చెరువులకు విడుదల చేశారు. రెండు రోజుల క్రితమే కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువన హగరి నదికి వదిలారు. ఇప్పుడు ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు గంగమ్మకు జలహారతి ఇచ్చి అనంతరం కుడికాలువ వద్ద తూము గేటుపైకి ఎత్తి నీటిని బ్రహ్మసముద్రం మండలంలోని భైరసముద్రం చెరువుకు విడుదల చేశారు. అలాగే ఎడమ కాలువ ద్వారా గుమ్మఘట్ట, కలుగోడు, భూపసముద్రం చెరువులకు విడుదల చేశారు. తర్వాత అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ బీటీపీ నుంచి చెరువులకు నీటిని వదలడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు బీటీపీకి రెండు టీఎంసీల నీరు వచ్చాయని, ఇది ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. తామిద్దరం ఎమ్మెల్యేలమూ సీఎం చంద్రబాబు దగ్గరకు వెళ్లి కాలువలకు నిధులు తీసుకువచ్చి నిత్యం బీటీపీకి నీళ్లు వచ్చేలా చూస్తామని తెలిపారు. ఇరిగేషన్ ఈఈ నారాయణనాయక్ మాట్లాడుతూ.. డిసెంబరులో కుడి, ఎడమ కాలువల కింద ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో మూడు వేల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో కొనసాగుతుండడంతో దీనిని బేరీజు వేసుకుని నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్‌లు, నాయకులు గిరి మల్లప్ప, హనుమంతు, హనుమంతరెడ్డి, కాదలూరు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కాలువ సన్న న్న, పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

బొమ్మనహాళ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో పాటు రంగయ్యగుడ్డ జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో వేదవతి హగరిలో వరదనీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. మండలంలోని అనేక గ్రామాల్లో పంట పొలాలు నీటిలోనే ఉన్నాయి. వరద నుంచి తేరుకున్న పొలాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. అనేక చోట్ల పలు రకాల పంటలు కుళ్లిపోయా యి. వాటిని కాపాడుకునేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. పత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి.



వేదవతి హగరిలో ప్రవహిస్తున్న వరదనీరు

పరివాహక గ్రామాలకు హెచ్చరికలు

కణేకల్లు: మండలంలోని వేదవతి హగరి నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఫణికుమార్, వీఆర్వో పవన్‌కుమార్ గురువారం హెచ్చరికలు జారీ చేశారు. బీటీపీ నుంచి నీటిని వేదవతి హగరికి విడుదల చేస్తుండడంతో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా మెలగాలని సూచించారు. రచ్చుమర్రి, గంగలాపురం, కణేకల్లు, కళేకుర్తి, ఉడేగోళం, మాల్యం, బ్రహ్మసముద్రం, బెణెకల్లు ప్రజలు హగరి వైపు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు మెలగాలని సూచించారు.

ఆర్టీఓగా రమేష్ బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో గురువారం మొట్టమొదటి ఆర్టీఓగా ఎస్ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన కృషి చేస్తానని తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

బొమ్మనహాళ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా ఎల్‌బీ నగర్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీలర్ల సంఘం నూతన కమిటీని యూనియన్ నాయకులు మండలకేంద్రంలో గురువారం ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా పయ్యావుల మోహన్, ఉపాధ్యక్షుడిగా కురుబ తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా ప్రభయ్యస్వామి, కార్యవర్గ సభ్యులుగా ఖాసీంవలి, భాస్కర్, బెళ్లి హనుమంతు, వన్నూరుస్వామి, రాజును ఎన్నిక చేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, మాజీఎంపీపీ షణ్ముఖయ్య, టీడీపీ నాయకుడు పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

బ్రహ్మసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిమ్మప్ప, జీ ప్రభాకర్ సభ్యత్వ నమోదును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనాపురం, పాలవెంకటాపురం, మామడూరు, కొండాపురం, సూగేపల్లి, ఎరడికెర, వెస్ట్ కోడిపల్లి, పొబ్బర్లపల్లి, పోలేపల్లి, గుండిగానిపల్లి, వేపులపర్తి ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయ సంపాదకుడు నరేష్ కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు రామ్మోహన్, మంజునాథ, తమన్నా, శ్రీనివాసులు, రామన్న, జగదీష్, చెలిమేగౌడ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

బ్రహ్మసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవాని తిప్ప ప్రాజెక్టు వద్ద సవారమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.ఐదు లక్షల విరాళం ప్రకటించారు. ప్రాజెక్టు గురువారం పూర్తిస్థాయిలో నిండటంతో.. కాలువలకు నీటిని వదిలేందుకు ఆయన అక్కడికి వచ్చారు. తొలుత స్థానిక సవారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవానితిప్ప గ్రామ ప్రజలు సవారమ్మ ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా.. స్పందించిన ఎమ్మెల్యే రూ.ఐదు లక్షలు విరాళం ప్రకటించారు. తక్షణమే పనులు ప్రారంభించేందుకు రూ.రెండు లక్షల నగదును గ్రామపెద్దలకు అందజేశారు. మిగిలిన రూ. మూడు లక్షలు పనులు జరుగుతుండగా అందజేస్తానని తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం ఇవ్వడంతో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మొరేపల్లి మల్లికార్జున, సీనియర్ నాయకులు కరణం రామ్మోహన్ చౌదరి, టీఆర్ తిప్పేస్వామి, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు నగదును అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ముళ్ల పొదల తొలగింపు

కణేకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిగానిపల్లి సర్పంచ్ రుద్రముని తన ఉదారతను చాటుకున్నారు. సొంత ఖర్చులతో దాదాపు 20 కిలోమీటర్ల రోడ్డుకు ఇరువైపులా ఉండే ముళ్లకంపలను ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు. ఆదిగానిపల్లినుంచి కొత్తపల్లి, పుల్లంపల్లి, రచ్చుమర్రి తదితర గ్రామాల వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండేవారు. ఇది గమనించిన సర్పంచ్ వాటిని తొలగింపజేశారు. బీజేపీ, టీడీపీ నాయకులు తిప్పేస్వామి, తిప్పారెడ్డి, హనుమంతు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో డిగ్రీ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్ర క్షేత్రంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు గురువారం రెండో రోజు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అక్కడి శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో కూరగాయల పంటల సాగు, వాటి సస్య సంరక్షణపై ఉద్యానవన పంటల శాస్త్రవేత్త యుగంధర్ విద్యార్థులకు వివరించారు. కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ చినరాయుడు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ ఎంవి శేషయ్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మల్లికార్జున, శాస్త్రవేత్తలు శిరీష, హరిణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

యాడికి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సచివాలయం- 1, 2లను ఎంపీడీఓ వీరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు నిర్వహించడం రాకపోతే మీరేమి విధులు నిర్వహిస్తారంటూ మండిపడ్డారు. సచివాలయాలకు సంబంధించిన ప్రతి రికార్డును తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ శశికళ, సిబ్బంది ఉన్నారు.

పోలియో దినోత్సవంపై ర్యాలీ

బొమ్మనహాళ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్‌లో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవంపై వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ పోలీ యోపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలియో పక్షవాతం, శాశ్వత అంగవైకల్యం కల్పిస్తుందని తెలి పారు. దీనిని 5 ఏళ్ల లోపు వయసులోపే రెండు పోలియో చుక్కలు వేసి నివారించ వచ్చని చెప్పారు. ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా పశుగణన

వెంకటేశ్వర్లు, డీడీ, పశుసంవర్ధక శాఖ, ఉరవకొండ



ఇంటర్వ్యూ

ఉరవకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో 25వ భారత పశుగణన శుక్రవారం నుంచి చేపడుతున్నట్లు ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ కార్యక్రమంపై ఆయన పలు విషయాలు వె ల్లడించారు.

ప్రశ్న: పశుగణనకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
జవాబు: పశుగణన పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ భారత పశువుల గణన జరుగుతుంది. డివిజన్‌లోని 14మండలాల్లో పశుగణకు వైద్యులను సూపర్‌వైజర్లుగా నియమించాం. వారు యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తారు. ప్రతి నివాసాన్ని సందర్శించి ఆవులు, గేదేలు, మేకలు, కోళ్లు, పందులను జాతుల వారిగా లెక్కిస్తారు.

ప్రశ్న: నట్టల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: నట్టల నివారణ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ వరకూ జరుగుతుంది. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేస్తున్నాం. ఉరవకొండ డివిజన్ పరిధిలో 14లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. నట్టల నివారణ మందును తాపడం వల్ల వాటిలో రోగ నిరోధకశక్తి పెరిగి మాంసం వృద్ధి చెందుతుంది.

ప్రశ్న: పాడిరైతులకు ఎలాంటి పథకాలు అమలవుతున్నాయి?
జవాబు: పాడిరైతులకు ప్రభుత్వం పశుబీమా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో పశుబీమా, టీఎంఆర్ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. టీఎంఆర్(టోటల్ మిక్స్‌డ్ రేషన్)ను రైతులకు ఇస్తున్నాం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ శివమ్మ హెచ్‌ఎం రమాదేవి

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఆరో తరగతి విద్యార్థి నిఖిల్ కుమార్, ఏడో తరగతి విద్యార్థిని అమృత ఇటీవల అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ శివమ్మ తెలిపారు. వీరు నవంబరు 8, 9, 10వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఆ విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన గల ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్ర భాకర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్లూరు రోడ్డులో ఖాళీగా ఉన్న 4.25 సెంట్లు, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న 11.75 సెంట్లలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. దీనికి సలహాలు, సూచనలు కావాలని ప్రజలను కోరారు. నాలుగు అంతస్తుల నిర్మా ణం చేపట్టనున్నట్లు తెలిపారు. గుడ్‌విల్, బాడుగ తదితర అంశాలపై చర్చించారు. కమిషనర్ శివరామకృష్ణ, మున్సిపల్ అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

టాక్స్ విధింపులో వ్యత్యాసం ఎందుకు?

టాక్స్ విధించే పద్ధతిలో ఏపీకి ఒక న్యాయము, ఇతర రాష్ట్రాలకు ఒక న్యాయమా అని జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. స్థానిక తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులకు ఏపీలో టాక్స్ వసూలు చేయరని, కానీ ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు టాక్స్ విధించడం ఏంటని ప్రశ్నించారు. ఇక నుంచి ప్రభుత్వం దృష్టిపెట్టి ఏపీలో కూడా ఇతర రాష్ట్రాల బస్సులకు టాక్స్ విధించాలని డిమాండ్ చేశారు. ఏపీ, తెలంగాణాకు సంబంధించిన బస్సులు కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ తదితర రాష్ట్రాలకు వెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు టాక్స్‌లు చెల్లించి తిప్పాలని, కానీ కానీ ఇతర రాష్ట్రాల వారు మన రాష్ట్రంలోకి వస్తే టాక్స్ చెల్లించకుండా ఉండడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రస్తుతం బస్సుల యజమానులకు వీటిపై సరిగా అవగాహన లేదన్నారు. ఇప్పటికైనా ఇలాంటివి తెలుసుకుంటే మంచిదని అన్నారు. బుక్కరాయసముద్రం వద్ద ఆక్రమించిన కాలువను దీపావళిలోపు తొలగించాలి లేనిపక్షంలో స్వయంగా నేనే వెళ్లి తొలగించడం జరుగుతుందని ఆయన అన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

శెట్టూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లతో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు ఖచ్చితమైన తూకాలతో, ధరలతో రేషన్ సరుకులను అందించాలని సూచించారు. ఏవైనా తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

పెద్దవడుగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పంటలకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం వ్యవసాయశాఖ డీడీఏ మద్దిలేటి శిక్షణ నిర్వహించారు. రైతులు పంటలకు తెగులు సోకినట్లయితే రైతుసేవా కేంద్రం అధికారి ద్వారా ఫొటో తీయించి అప్‌లోడ్ చేయించాలని, తర్వాత వెంటనే నేరుగా శాస్త్రవేత్త దానికి సంబంధించిన సస్యరక్షణ నివారణ చర్యల గురించి తెలియజేస్తారని తెలిపారు. రైతులు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, పలువురు రైతులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరిపైర్లు



పామిడి, కణేకల్లులో నేలకొరిగిన వరిపైర్లు

పామిడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేని వర్షం రైతులకు తీరని నష్టాలనే మిగిల్చింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పామిడి పట్టణంలోని వరిపైర్లు నేలకొరిగాయి. దీంతో వరిపంటను సాగు చేస్తున్న రైతులకు తీరని శోకం మిగిలింది. కోత దశలో ఉన్న వరి పైర్లు వర్షానికి నేలకు ఒరగడంతో ఆయా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎద్దులపల్లి రోడ్డు లో కౌలు రైతు మల్లికార్జునకు చెందిన ఐదు ఎకరాలలో వరి పైరు పూర్తిగా నేలకొరిగింది. దీంతో ఆ రైతు కన్నీరు మున్నీరయ్యాడు. ఈ అకాల వర్షం వల్ల తనకు సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరారు.

కణేకల్లు: ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని గంగలాపురం, ఉడేగోళం, కణేకల్లు,బ్రహ్మసముద్రం తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాలలో వరిపంట దెబ్బతినింది. ప్రస్తుతం వరిగింజ పాలదశలో ఉండగా వరుసగా కురుస్తున్న వర్షాలు వరిపంటపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.